# పిలుపే బంగార మాయెరా!

ఇడ్లీ సాంబారూ, పెసరట్టూ ఉప్మా, కప్పూ ప్లేటూ లా, బహుపసందుగా సరిపోయాయి అలివేలూ రవణలపేర్లు, విడదియ్యడానికి వీల్లేకుండా.

పేర్లు బాగానే కుదిరాయిగాని పేర్లు పెట్టి ఒకర్నొకరు పిలుచుకోడానికి మాత్రం కుదరలేదు. ఏవంటే, అప్పటికింకా భర్తనిపట్టుకొని నువ్వు అనడంకానీ, అతణ్ణి పేరెట్టి పిలవడంకానీ తెలుగు అమ్మాయిలకి అలవాటు కాలేదు. అలాగే అబ్బాయిలకీను.

దానికి తోడు రవణకి బోలెడు సిగ్గూ మొహమాటమూనూ. నాన్నా అమ్మా వింటారనీ, తమ్ముడో చెల్లెలో విని ఆట పట్టిస్తారనీను. అలివేలుకీ అలాంటి సిగ్గుతోబాటు మరింత భయంకూడా ఉంది. అయితే వాటికితోడు కొంచెం కోరికా, కాస్తా సరదా ఉన్నాయి. అవి ఏవిటంటే, తను ఎలాగా పిలవలేదు అతణ్ణి. అతనేనా పిలవొచ్చుగా నోరారా 'అలివేలూ' అంటూ - లేదా స్వీటీ అంటూ - డియర్ అంటూ. అవేవీ వద్దు - పూర్తి పేరూ వద్దు, పోనీ- తన స్నేహితురాళ్ళని వాళ్ళ వాళ్ళ భర్తలు 'లీలూ' అనో, 'సుందీ, అనో, 'సరూ' అనో ముద్దుగా ముచ్చటగా చిట్టి పొట్టి పేర్లతో పిలిచినట్లు, తనని గూడా 'అలీ' అనో 'వేలూ' అనో పిలవొచ్చుగా? ఎందుకు పిలవరు? మనసులోని కోరికని మగడు తీర్చకపోతే ఎలా? లాభంలేదు. అడగాలి. "నన్ను ఎందుకు పేరెట్టి పిలవరూ?" అని దెబ్బలాడి అయినా పిలిపించుకొని సరదా తీర్చుకోవాలి.

ఇలా నిశ్చయించుకొని, యుద్ధానికి సిద్ధం అయిన సత్యభామలా నడ్డి బిగించింది. కొంగు బొడ్లులో దోపుకొంది. ఒక సుముహూర్తంకోసమే ఎదురు చూస్తోంది. అంటే, మావగారు వాహ్యాళికీ, అత్తగారు గుడికీ, మరిది వీధులు సర్వే చెయ్యడానికీ, ఆడబడుచు సంగీత సాధనకని పక్కింటికీ, ఒకేమారు వెళ్ళి, భర్త నొక్కణ్ణీ ఇంట్లో తన దయాదాక్షిణ్యాలకి వదిలేసే సమయం కోసం అన్నమాట.

తపస్సే చేసిందో - పూజలే సాగించిందో - ఉపవాసాలే ఉందో - మొక్కులే

మొక్కిందో - మొత్తానికి ఆ దేవుడు కరుణించాడు. అలివేలుకి ఆ అవకాశం లభించింది. ఇంక అప్పుడు చూస్కోండి - బెత్తం పుచ్చుకుని బెదిరించే టీచర్‌లాగ "అవును గానీ! మీరు నన్ను పేరెట్టి ఎందుకు పిలవరూ?" అంటూ నిలదీసింది.

రవణ మొదట ఆ ప్రశ్నకి తెల్లబోయాడు.

తర్వాత గుడ్లు తేలేసి చూశాడు. గుటక మింగాడు. సమాధానం ఏంచెప్పాలో తోచక, వర్తినే నాలుగు గోడలూ పట్టుకొని గదిలో గానుగెద్దులాగ తిరిగాడు. కాస్సేపు తిరిగే సరికి కాళ్ళు నెప్పి పెట్టి ఉంటాయి, వచ్చి వాలుకుర్చీలో సోలిపోయాడు. తన ప్రశ్నకి సమాధానం రాకపోయేసరికి, "మిమ్మల్నే! చెప్పండి" అంది అలివేలు.

చెప్పకపోతే చెవి మెలేస్తుందేమో అన్నట్లు భయపడి, మధ్య మధ్య అక్షరాలు మింగేస్తూ తడబడుతూ "ఏవిటి? ...పే..రు!... పిలవడం... అంతేనా?... అలాగే ...కాని...." అన్నాడు ఏదో కొత్త భాష మాట్లాడుతున్నట్లు.

"కాని ఏవిటి?"

"నాన్నా వాళ్ళూ ఉన్నారు చూడు"

"ఏం ఉంటే?"

"అది కాదు, మా యింట్లో ఇంకా అలవాటు లేదు భార్యని పేరెట్టి పిలవడం. మా తాతగారు మాబామ్మని ఏమేవ్ ... ఒసేవ్ అనే పిల్చేవారట. ఇంకా మా నాన్న గారే కాస్త నాగరికత తెచ్చుకొని ఓ మెట్టెక్కి ఇదిగో! నిన్నే! ఓయ్! వినిపిస్తోందా... అంటున్నారు"

"మీరు మరో మెట్టెక్కండి"

"హమ్మో!"

"ఏం? భార్యని పేరెట్టి పిలిస్తే గుంజీలు తీయిస్తారా, గోడకుర్చీవేయిస్తారా?"

"అదేంకాదు... ఏదో ఎబ్బెట్టుగా ... సిగ్గుగా..."

"సిగ్గా? సిగ్గుమాలిన పని మీరేం చేస్తున్నారు, ఎవరి పెళ్ళాన్నో పిలవడం లేదుగా?"

"నిజమే... కానీ..."

"కానీ లేదు ఏంలేదు. రేపు దశమీ బుధవారం. శ్రవణం నక్షత్రం ప్రొద్దుట తొమ్మిది వరకూ ఉంది. ఉదయం వర్జ్యం లేదు. అందువల్ల నిద్రలేస్తూనే దేవుడికి దణ్ణం పెట్టుకుని, ధైర్యం చిక్కబట్టుకొని 'అలివేలూ! కాఫీ పట్రా అనండి...' అంటేనే కాఫీ .. లేకపోతే లేదు"

"ఇలా అల్టిమేటమ్ఇచ్చి, కంఠం మీద కత్తి పెడితే ఎలా? కొంచెం టైమియ్యి!"

అలివేలు టైమియ్యలేదు.

ఫలితంగా, రవణకి కాఫీ సరే, బ్రష్ మీదకి పేస్టూ, బాత్ రూమ్‌లోకి టవలూ, హేంగర్ మీదకి ఇస్త్రీ బట్టలూ రాలేదు. అలా ఒక రోజు కాదు. రెండు రోజులు. తన సర్వ సౌకర్యాలకీ రవణ స్వయం కృషి మీదే ఆధారపడవలసి వచ్చింది.

ఆ భార్యాభర్తల మధ్య నిశ్శబ్దయుద్ధం సాగుతోందని ఎవరూ కనిపెట్టలేకపోయారు. రెండు రోజులు పోయేటప్పటికి దిగిరాడా - ఆ ఏడు కొండల వెంకట రవణే దిగివస్తాడట అలివేలు మంగ కోసం రోజూను, అనుకొని భరోసాగా కూర్చున్న అలివేలుకి ఆశాభంగం అయింది. ఇప్పుడేవిటి చెయ్యడం? ఈయన సిగ్గూ, భయం, మొహమాటం ఇవన్నీ సిమెంటూ చిప్పూ ఇసకలా కలిసిపోయి, కాంక్రీటు శ్లాబ్‌లా ఘనీభవించి ఉంటుందని అనుకోలేదు. దొంగని లొంగదీయడానికి పోలీసు వాళ్ళకి ఉన్నట్లు భర్తల్ని దార్లో పెట్టడానికి భార్యలకి ఎన్నో ఉపాయాలుంటాయి - అవన్నీ పనిజెయ్యనప్పుడు ప్రయోగించే ఆఖరిఆయుధం ఒకటి పోలీసు వాళ్ళ కంటే అదనంగా ఉంటుంది ఆడవాళ్ళకి.

అదే కన్నీరు! ఆ ఆఖరి ఆయుధం ఉపయోగించింది, మూడో నాటి రాత్రి పడకగదిలో. ఎలాంటి భర్త అయినా లొంగవలసిందే.

ఠక్కున లేచి కళ్ళు తుడిచి, అక్కున చేర్చుకొని, ఆదరంగా 'అలివేలూ!' అనవలసిందే రవణ. కాని అనలేదు. తను కూడా కళ్ళనీళ్ళు పెట్టుకుంటూ కూర్చున్నాడు.

"అదేవిటండీ!' అంటూ అలివేలు కంగారు పడింది. "పోన్లెండి...నన్ను పేరెట్టి పిలవక్కర్లేదు. మీరింత కష్టపెట్టుకుంటారంటే ఇంతగా మనసుపడి అడక్కపోయేదాన్ని" అంటూ నొచ్చుకొంది.

"కష్టం కాదు. నాకూ ఇష్టమే... కానయితే కొంచెం సిగ్గూ మొహమాటమూను... మనకి ఉద్యోగం వచ్చి పొరుగూరులో కాపురం పెడతాం చూడు. అప్పుడు ఇద్దరమే ఉంటాం. చుట్టూ ముక్కూమొహం ఎరగని కొత్తవాళ్ళు, నాకు మొహమాటం ఉండదు. దర్జాగా పిలిచేస్తా. అందువల్ల అప్పటివరకూ ఈ ముచ్చట వాయిదా వేద్దాం. ఏం? ప్లీజ్" అన్నాడు రవణ.

"సరే" అని ఒప్పుకోవడం కంటే మార్గాంతరమూ కనిపించలేదు అలివేలుకి - అందుకే, సరే, అంది. ఇద్దరూ ఒక ఒప్పందానికి వచ్చారు. ఆ ముహూర్తం ఎప్పుడా అని ఎదురు చూస్తున్నారు.

కేలెండరులో ఏడెనిమిది కాగితాలు చిరిగే సరికి, ఆ ముహూర్తం రానే వచ్చింది.

పట్నంలో కొడుకుచేతా కోడలిచేతా కొత్త కాపురం పెట్టించి, రెండు రోజులుండి, రవణ తల్లీ తండ్రీ,పల్లెటూరు వెళ్ళిపోయాక, అలివేలు రవణకి దగ్గరగా జరిగి అతని కాలరు సర్దుతూ, "ఏవండీ ... మన ఒప్పందం.." అంది అతని కళ్ళల్లోకి చూస్తూ.

ఆకళ్ళని మృదువుగా పెదిమలతో సత్కరించి, "ఓ అలాగే! సాయంత్రంనేను ఇంటికొచ్చేసరికి అలంకరించుకొని గేటు దగ్గర నుంచోక, పెరట్లో ఎక్కడో ఉండు, తలుపు కూడా గడియ పెట్టుకుని ఉండు" అన్నాడు రవణ -

"అదేవిటి?" విస్తు బోయింది అలివేలు.

"లేకపోతే ఎలా పిలవడం? ఎదురుగుండా ఉన్నప్పుడు పిలిస్తే, ఎబ్బెట్టుగా ఉంటుంది. ఎక్కడో ఉంటేనే చక్కగా పిలవొచ్చు..."

"ఓ .. అదా?... సరే సరే.. మీరు పెందరాళే వచ్చెయ్యండి. అప్పటికి నేను అంట్లు తోముకుని గదులుతుడుచుకొని, మంచి చీరకట్టుకొని పెరట్లో మందారం చెట్టు దగ్గర నిలబడి ఉంటాను. మీ పిలుపు రాగానే వచ్చి తలుపు తీస్తాను."

ప్లాను బాగుందంటే బాగుందనుకున్నారు ఇద్దరూ.

తీరా ఈలవేసుకుంటూ ఇంటికి వచ్చిన రవణకి, గేటు ముందరే ప్రత్యక్షం అయింది అలివేలు, అప్పుడే ఆవిష్కరించిన జాతీయపతాకంలా రంగు రంగుల చీర వంటి మీద రెపరెపలాడుతూ ఉంటే -

పెరడు అంటే, ముందు పెరడు అనుకొందా?

ఛ.. ఛ...ప్లానంతా పాడుచేసేసింది గదా - 'అలివేలూ!' అంటూ తను ఎంత ఆవేశంగా పిలవాలని వచ్చాడూ? కోపంతో ఏదో అనబోయాడు రవణ.

కాని ఆమె వెంటనే ఎదురొచ్చి, నోరు మూసి, కూచిపూడీ భరతనాట్యం కలగాపులగం చేసేసి, అభినయిస్తూ ఏవో మూగ సంజ్ఞలు చేసింది. రవణకేం అర్థం కాలేదు - "ఏవిటి? ఏమైంది?" అని అడగడానికి వీల్లేకపోయింది - ఏవంటే రవణ నోరు అలివేలు చేతుల్లో బందీగా ఉంది - అందుకే కళ్ళతోటే అడిగాడు, వీలైనంత వంకరటింకరగా మొహం పెడుతూ -

"ఆగండి - పేరెట్టి పిల్చారు గనుక - కొంపమునుగుతుంది"

తన చేతుల్తో ఆమె చేతులు తప్పించి "ఏం?" అన్నాడు గట్టిగా -

"ఇప్పుడే అరగంట క్రితం కొత్తగా పనిమనిషి కుదిరిందండీ!"

"కుదిరితే!" కోపంగా అరిచాడు.

"అబ్బ - అరవకండి -లోపల పని జేస్తోంది. దాని పేరూ అలివేలేట. మీరెక్కడ

పిలిచేస్తారో అని ఇలా పరిగెట్టుకుని ఎదురొచ్చా.."

"అదా సంగతి?... చంపేశావు. కాదు కాదు బతికించావు..."

"ఎప్పుడూ లేంది ఇప్పుడు కొత్తగా మీరు నన్ను పేరెట్టి పిలవడం మొదలెట్టారనుకోండి. - కొత్త బిచ్చగాడు పొద్దెరగడన్నట్టు - అది ఉండగా కూడా పిల్చెయ్యగలరు... అప్పుడది, అయ్యగారూ, అంటూ ... ఎందుకు లెండి... అది పనిమనిషిగా ఉన్నన్నాళ్ళూ మన సరదాని వాయిదా వేద్దాం..."

భార్య చెప్పింది సమంజసంగా, బాగానే ఉంది. కానైతే తనని కొత్త బిచ్చగాడితో పోల్చడం మాత్రం బాగో లేదనిపించింది రవణకి -

"అయితే అది పోటీ వచ్చిందన్నమాట నీకు?"

"చాల్లెండి మీ జోకు"

ఇద్దరూ నవ్వుకున్నారు - అలా నవ్వుకుంటూనే, నాలుగేళ్ళయ్యే సరికి, ఇద్దరూ నలుగురయ్యారు...

పని ఎక్కువైందనీ, జీతం తక్కువైందనీ, పెద్ద అల్లరి చేసి పనిలోంచి మానేసింది ఆ తర్వాత రెండేళ్ళకి పని మనిషి.

పిల్లలతో, ఇంటి చాకిరితో, సవాలక్ష బాధ్యతలతో సతమతమై పోతున్న భార్యని చూస్తే జాలేసింది రవణకి - ఆమెలో తొలినాటి చురుకూ చలాదకీతనం ఏవైపోయాయో పాపం. ఈ బరువు బాధ్యతలతో ఉన్న సరదాలన్నీ వదులుకున్నట్లుంది.

అసలు సరదా కూడా! అదే! పేరెట్టి పిలిపించుకొనే సరదా! పాపం భార్యపై జాలేసింది - పని మనిషి భూతం పోయింది కనక, ఇప్పుడు హాయిగా నభూతో నభవిష్యతి అన్నట్లు పేరెట్టి పెళ్ళాన్ని పిల్చెయ్యవచ్చు -

"ఏం? ఇవాళ రెడీయేనా?" అని అడిగాడు హుషారుగా. ఆమె ముక్తసరిగా 'మీ యిష్టం, అంది. అంటే, ఆమెలో, పూర్వం ఆసక్తి సరదా తగ్గిపోయాయన్నమాట । సృష్టిలో అదేంచిత్రమో! భార్యమనసు పడినన్నాళ్ళూ భర్తకి సరదా ఉండదు. ఆమెకి తగ్గిపోయే సరికి, అతనిలో బయలు దేరుతుంది సరదా.

రవణ విషయంలో ఇప్పుడు సరిఘ్గా అదే అయింది - భార్యని పేరెట్టి ఎప్పుడు పిలుద్దామా అని తహతహలాడిపోసాగాడు - అందుకు సుముహూర్తం సాయంత్రంగా నిశ్చయించి, వెనకటిలాగే పురమాయించాడు "నేను వచ్చేటప్పటికి గేటులో ఉండకు లోపల ఎక్కడో ఉండు ఆవటా" అంటూ -

ఊహల్లో తేలిపోతూ, పరుగులాంటి నడకతో ఇల్లు చేరుకొనేటప్పటికి, మళ్ళీ అదే

కథ. వీథి గుమ్మంలో విలాసంగా నుంచుంది. రవణ అగ్గిలం మీద గుగ్గిలం అయిపోయాడు.

"నేను చెప్పిందేవిటి? నువ్వు చేసిందేవిటి?" అంటూ గట్టిగా అరిచాడు -

"అబ్బ అరవకండి - లోపల మీనాన్నగా రున్నారు. మనవల్ని చూడాలని అనిపించిందిట.."

"వచ్చారా? మరి చెప్పావుగావేం?" అంటూ అంతకోపాన్నీ మరిచిపోయి "నాన్నా" అంటూ లోపలికి వెళ్ళాడు రవణ.

రెండో ప్రయత్నం కూడా ఇలా బెడిసి కొట్టేసరికి, ఉన్న సరదా కాస్తా, హుష్‌కాకీ, అయిపోయింది - అయితే పూర్తిగా పోలేదు అంతర్గత జ్వరంలా ఇద్దరిలోనూ కాస్తూనే ఉంది కాస్తోకూస్తో. విజృంభించడానికి మాత్రం వీలు కలగడంలేదు.

ఈలోగా ప్రమోషను వచ్చి, మరో ఊరు ట్రాన్స్ఫర్ అయింది రవణకి - కొత్త ఊరు - కొత్త మనుష్యులూను - ఇక్కడ తను భార్యని పేరెట్టి పిలిస్తే అడిగే వారెవరూ ఉండరు అనుకున్నాడు. అక్కడికి ఇన్నాళ్ళూ ఆయా ఊర్లలో అడగడానికి ఎవరో రెడీగా ఉన్నట్లు.

పిలుస్తాడు - మనసు తీరా పిలుస్తాడు - ఒక పేరెట్టికాదు - సహస్రనామాలు చదివినట్లు వెయ్యి పేర్లెట్టి - వెంటనే దాని వల్ల వచ్చే ప్రమాదాలు తల్చుకుని "హమ్మో - వద్దులే! ఉన్న ఆ ఒక్కపేరూ చాలు" అనుకున్నాడు.

ముత్యం మూడోసారి ప్రయత్నించడానికి సిద్ధాంతిచేత శుభఘడియలు చూపించి, లగ్నం కూడా పెట్టించాడు. షరా మామూలే - సాయంత్రం తను ఆఫీసు నుంచి రావడం. ఆమె గుమ్మంలో కనిపించకపోవడం. తను అనురాగం ఉట్టిపడేటట్లు రాగయుక్తంగా పిలవడం -

ఈప్రయత్నం తప్పకుండా విజయవంతం అవుతుందని గంపెడాశతో వచ్చాడు. - గంపెడు మాట దేవుడెరుగును గరిటెడైనా మిగల్చకుండా, అలివేలు వీధి మొగతిరిగే సరికే ప్రత్యక్షమైంది.

పూర్వంలా రవణ ఈ మారు ఎగర లేదు - ఎగిరితే, ఈ యాభయ్యోయేట, ఏకాలో విరుగుతుందని భయపడ్డాడో ఏమో -

నీరసంగా తలవాల్చేస్తూ, కళ్ళతో అడిగాడు ఈ మారు ఏమైందీ అని -

"మన ఇంటి యజమానురాలు లేదూ? ఆమెదీ ఇదే పేరుట - ఇందాకా మాటల్లో తెలిసింది"

అరికాలికింద ఆటంబాంబు పేలినట్లు ఉలిక్కిపడి, 'హమ్మో' అంటూ ఓ గెంతుగెంతాడు రవణ -

"ఇంకీ జన్మకి పెళ్ళాన్ని పేరు పెట్టి పిలిచే యోగం తనకి లేదు. లేదుగాక లేదు" అంటూ నిశ్శబ్దంగా మనస్సులో అరిచాడు.

అలివేలు కూడా అలాగే అనుకొంది - ముద్దుగా భర్త చేత పేరెట్టి పిలిపించుకొనే అదృష్టం తనకి లేదు -

పిల్లలు పెరిగిపెద్దవాళ్ళయ్యారు -

చదువులు పూర్తయి ఉద్యోగాలొచ్చాయి. పెద్దాడికి పెళ్ళయి కోడలు కాపురానికి కూడా వచ్చింది. ఇంక ఇప్పుడు షష్టిపూర్తి దగ్గరపడుతూన్న తను, పెళ్ళాన్ని పేరెట్టి పిలవడమా? హవ్వ - ఎవరేనా వింటే నవ్విపోతారు -

పాత సరదాలూ కోరికలూ అన్నీ చప్పబడిపోయి, కొత్తగా పెద్దరికం హుందాతనం, బలవంతంగా వచ్చి మీదపడి, ఏదో రోజులు నెట్టుకొస్తున్నారు, అలివేలూ రవణాను. ఇలా ఉండగా ఉండగా, వాళ్ళ జీవితంలో ఓ వెలుగు వెలిగింది - మెరుపు మెరిసింది.

పెద్దబ్బాయికి ఆడపిల్ల పుట్టింది రవణకి ఓ అద్భుతమైన ఆలోచన తట్టింది -

ఈ పసికూనకి, అలివేలు, అని పేరు పెడితే - ఈ పిల్ల వంకని తను పెళ్ళాన్ని పిలిచెయ్యొచ్చు ఏ భయమూ లేకుండా -

ఎగిరి గంతేశాడు.

మర్నాడు లేస్తూనే, నిర్భయంగా, నిస్సంకోచంగా ధైర్యంగా, ముప్పయిఏళ్ళ కోరికని ముచ్చటగా తీర్చుకుంటూ "అలివేలూ - నా బంగారూ!" అన్నాడు రవణ.

ఇంటిల్లిపాదీ మొదట తెల్లబోయారు. తర్వాత ఆయన పిలుస్తున్నది చిన్న అలివేలునని అర్థం చేసుకుని నవ్వుకున్నారు.

రవణ,"అలివేలూ" అన్నది తననే అని, బామ్మగారైన పెద్ద అలివేలుకి తెలుసు - ఏమంటే, ఆయన ఆ మాట అంటూ తన కేసి క్రీగంట కొంటెగా చూశారు.

ఆ చూపు వచ్చి తగిలేసరికి ఆమె హృదయం పారిజాతవృక్షాన్ని కుదిపినట్లు ఝల్లుమంది. నిజంగా పదహారేళ్ళ అమ్మాయిలాగే ఆమె మనస్సు సిగ్గు పడిపోయింది.

ఇన్నాళ్ళ కోరికా ఇలా తీరిందన్నమాట - ఓర కంట భర్తని చూసింది. అతను కొంటెగా ఎటో చూస్తూ, హఠాత్తుగా రామదాసుకీర్తన అందుకొని సీతారాముల ఫోటో కేసి అడుగుకదిపాడు భక్తి నటిస్తూ. కాని అందులోరక్తి ఎంత ఉందో. ఒక్క అలివేలుకే అర్థం అయింది. అవును మరి! పలుకే బంగారమాయెరా అంటూ ఎత్తుకో లేదు కీర్తన.

'పలుకు' అనే మొదటి మాట మార్చాడు - దాని బదులు 'పిలుపు' చేర్చాడు. అది ఆమె ఒక్కత్తే గమనించింది -

ఆ పిలుపు చాలు ఈ జన్మకి! అంటూ తన్మయత్వంతో అరమోడ్పుకన్నులతో ఆనందించింది అలివేలు -

భార్య కోరిక ఇన్నాళ్ళకి తీర్చగలిగానన్న సంతోషం, రవణ రెండు కళ్ళల్లోనూ కన్నీళ్ళ రూపంలో కన్పించింది.

ఎవరూ చూడకుండా ఆ ఆనంద బాష్పాల్ని కండువాతో వత్తుకుందాం అనుకున్నాడు.

కాని అలివేలు కంట పడనేపడింది.

ఆ కంటిలో వెలుగు వచ్చి, రవణ రెండు కళ్ళల్లోనూ పడి, జిగేల్‌మంది -

*(1996)*